| | |
|---|---|
| ప్రాంతం | : డల్హౌసీ |
| ఎంత దూరం | : పఠాన్ కోట్ నుండి 80 కి.మీ. |
| ఎలా వెళ్లాలి | : ఢిల్లీ నుండి పఠాన్‌కోట్ వరకూ రైళ్లుంటాయి. అటు నుంచి బస్సులో వెళ్లాలి. ఢిల్లీ నుండి డల్హౌసీకి డైరెక్టు బస్సులుంటాయి. |
| ఎక్కడ ఉండాలి | : డల్హౌసీలో అన్ని స్థాయిల వారికీ సరిపడ హోటళ్లున్నాయి. గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. కేవలం బెడ్లు మాత్రమే కావాలనుకునే వారికి యూత్ హాస్టల్ బంగళా ఉంది. టూరిస్టు హోటళ్లు కూడా ఉన్నాయి. |
| ఏమేం చూడాలి | : సాత్‌ధార, పాంచ్‌పుల్లా, సుభాష్‌చావ్లి, కాలాటాప్, ఖజ్జియార్, లఖర్‌మండి, చంబ, చంబలో చాముండ మందిరం, లక్ష్మీనారాయణ మందిరం, భూరిసింగ్ మ్యూజియం. ఏమీ లేకున్నా కాలినడకన డల్హౌసీలో నడవడం కూడా మంచి అనుభవం. |
| ఎప్పుడు వెళ్లాలి | : సాధారణంగా మార్చి నుండి జూన్ వరకూ, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో డల్హౌసీకి అధికంగా ప్రయాణమవుతారు. కానీ అప్పుడు ధరలు అధికంగా ఉంటాయి. డిసెంబర్ నెలలో డల్హౌసీకి వెళ్లటం ఉత్తమం. ధరలు తక్కువగా ఉంటాయి. జనం ఉండరు. మంచుకొండతో కప్పుకుని ప్రకృతి మనకోసం ఎదురు చూస్తూంటుంది. |

...20వ పేజీ తరువాయి

ఈ భూమిని కొని డల్హౌసీ సైనికుల స్థావరాలు, సెలవుల్లో గవర్నరు విశ్రాంతి బంగళాలు నిర్మించాడు. టిబెట్‌పై చైనా దురాక్రమణ చేసిన సమయంలో అనేక టిబెటన్లు డల్హౌసీలో తల దాచుకున్నారు. ఇక్కడే స్థిరపడ్డారు.

ప్రశాంతంగా, హాయిగా, చల్లగా, సుందరంగా ఉండే 'డల్హౌసీ' ప్రాంతానికి దంపతులు ఇద్దరూ కలసి వెళ్లటం ఒక అపూర్వమైన అనుభూతిగా మిగిలిపోతుంది. ఎందుకంటే, మామూలు టూరిస్టు ప్రాంతాల్లో ఉన్నట్టు ఇక్కడ హడావిడి ఉండదు. రణగొణ ధ్వని ఉండదు. ఆకుల గలగలలు, పక్షుల కిలకిలలు తప్ప మరోశబ్దం వినబడదు. ఈ సుందర వాతావరణంలో మనసుల గుసగుసలు మధురమైన యుగళగీతాలుగా మారి జీవితాన్ని రసమయం చేస్తాయి.

డల్హౌసీ నివసించే సమయంలోనే రవీంద్రనాథ్‌ఠాగోర్‌లోని కవి జాగృతమయ్యాడు. ఇక్కడే ఆయన తొలి కవిత రచించాడు. బక్రోటా కొండపైన ఉన్న 'స్నోడాన్' బంగళాలోనే ఈయన నివసించాడు. బస్టాండుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుభాష్ చావ్లీ వద్ద సుభాష్ చంద్రబోస్ కొన్నాళ్లు నివసించాడు.

డల్హౌసీలో శివ, విష్ణు, నారాయణ మందిరాలున్నాయి. నాలుగు కి.మీ. దూరంలో 2039 మీటర్ల ఎత్తున 'సాత్‌ధార' అంటే ఏడుపాయల స్రవంతి ఉంది. దీనికి 1. కి.మీ. దూరంలో 'పాంచ్‌పుల్లా' జలపాతం ఉంది. ఇక్కడే భగత్‌సింగ్ బంధువు, సుభాష్‌సేనలో సైనికుడు అయిన 'అజిత్‌సింగ్' స్మారకం ఉంది.

'డల్హౌసీ'కి 8 కి.మీ. దూరంలో 2440 మీటర్ల ఎత్తున 'కాలాటాప్' అనే సుందరమైన ప్రాంతం ఉంది. ఇక్కడ నుండి సూర్యాస్తమయ దర్శనం ఒక మరపురాని అనుభవం. చుట్టూ ఆకాశాన్ని తాకే కొండలు, పచ్చని పచ్చిక, వీటి నడుమ నుండి సూర్యుడు నెమ్మదిగా, అదృశ్యమవుతూ ఉంటే, ప్రకృతి సౌందర్య మహాత్త్యం మనసుకు అర్థమవుతుంది. ఇక్కడికి దగ్గరలోనే ఉన్న లష్కర్‌మండి నుంచి పర్వతదర్శనం అద్భుతంగా ఉంటుంది. రాత్రిళ్లు ఇక్కడే గడపాలనుకునే వారికి 'గెస్ట్‌హౌస్'లు కూడా ఉన్నాయి.

'డల్హౌసీ' ప్రయాణంలో కలికితురాయ్ వంటిది 'ఖజ్జియార్'. డల్హౌసీకి 22 కి.మీ. దూరంలో ఉన్న 'ఖజ్జియార్'ను మినీ స్విట్జర్లాండ్ అంటారు. దూరంగా మంచు కొండలు కనిపిస్తుంటాయి. ఎదురుగా పచ్చటి తివాచీ పరిచినట్టు మృదువైన గడ్డి దాదాపుగా రెండు కి.మీ. ప్రాంతాన్ని ఆక్రమించుకుని కనిపిస్తుంది. చుట్టూ ఎత్తైన వృక్షాలుంటాయి. దగ్గరలో ఓ నిర్మలమైన సరస్సు ఉంటుంది. చంద్రోదయమైన తరువాత ఈ ప్రాంతం సౌందర్యాన్ని అనుభవించాల్సిందే తప్ప, మాటల్లో వర్ణించటం సాధ్యంకాదు. నల్లటి ఆకాశంలో వెండి వెలుతురు వెదజల్లుతున్న చంద్రుడిని ఆహ్వానిస్తూ ఆకాశానికి చేతులెత్తినట్టు ఎత్తయిన చెట్లు, వెన్నెల కిరణాలను ఆత్రంగా జుర్రుకుంటున్నట్టు గడ్డి పరకల

